క్లుప్తంగా

మున్సిపల్ కార్మికులకు మెరుగైన వైద్యం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాల కార్మికులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరం విజయవంతమైనట్లు కమిషనర్ అరుణ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన క్యాంపులో 612 మంది కార్మికులు వైద్య సేవలు పొందినట్లు వెల్లడించారు. అపోలో, ఇతర ఆస్పత్రులకు చెందిన 14 మంది వైద్యులు 10 విభాగాల్లో సేవలు అందించారని వివరించారు.

న్యాయవాది గవాస్కర్‌పై తప్పుడు కేసు


సూర్యప్రతాప్

చిత్తూరు అర్బన్: విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌పై అక్కసుతోనే పోలీసులు తప్పుడు కేసులో ఇరికించారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యప్రతాప్ మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత నెల 26వ తేదీన ఓ పార్టీ ఆఫీసుపై దాడి అనే అభియోగంలో ముద్దాయిల తరపు మంగళగిరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన గవాస్కర్‌ను కావాలనే 88వ ముద్దాయిగా చేర్చారని ఆరోపించారు. పోలీసులు ఎవరి మెప్పు కోసమో అధికార దుర్వినియోగానికి పాల్పడితే భవిష్యత్‌లో ముప్పు తప్పదని హెచ్చరించారు.

స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. మేయర్ అముద, కమిషనర్ అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులైన డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఆర్.శశి కుమార్, యస్.సుష్మ, కె.అశోకన్, కె.నిర్మల పాల్గొన్నారు. స్వీపింగ్ మిషన్‌కు సంబంధించి ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు బకాయి పడిన మొత్తాన్ని సాధారణ నిధుల నుండి చెల్లించేందుకు ఆమోదించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణయ్య, ఎంహెచ్‌ఓ అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికలు

తవణంపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని పూతలపట్టు నియోజకవర్గ ఎస్‌ఎంసీ ఎన్నికల ఇన్‌చార్జి, సీఎంఓ జయప్రకాష్‌నాయుడు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8న అన్ని పాఠశాలల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు నియమావళి పాటిస్తూ ఎన్నికల సజావుగా జరపడానికి ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈఓ త్యాగరాజులురెడ్డి, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యేకు ఛాంబర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే కోసం ప్రత్యేక ఛాంబర్ ఏర్పాటు చేశారు. శనివారం ఈ మేరకు ఛాంబర్‌ను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ప్రారంభించారు.

సమష్టిగా మండల అభివృద్ధికి కృషి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మండల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ గీతా కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శాఖలవారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులను వివరించారు. అనంతరం స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనులను గుర్తించి, వాటిని పూర్తిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండలానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

పూతలపట్టు(యాదమరి): మండల కేంద్రంలోని యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్యాధికారులు, సిబ్బందికి వివరించారు. గతంలో పెరుమాళ్లపల్లిలో డెంగీ సోకిన గృహాన్ని సందర్శించి, లార్వాలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ పీరుసాహెబ్, వైద్యాధికారి సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం


గుడిపాల: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ స్వర్ణలత


తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు


చెంగనపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సీడీపీఓ నిర్మల

పూతలపట్టు: పుట్టిన నాటి నుంచి తల్లిపాలు ఇవ్వడం బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీఓ నిర్మల తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రంగంపేట ఎస్టీ కాలనీ, మద్దులయ్యగారిపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలతో ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. తల్లిపాలు ఆపేసి డబ్బా పాలను ఇవ్వకూడదని తెలిపారు. తల్లి పాలు తాగి పెరిగిన పిల్లల మెదడు చాలా చురుగ్గా పని చేస్తుందని, అలాంటి వారు చదువులో బాగా రాణిస్తారని పలు పరిశోధనల్లో వెల్లడైందని తెలిపారు. కాబట్టి పిల్లలు బాగా చదవాలన్నా, భవిష్యత్తులో అభివృద్ధి సాధించాలన్నా, పుట్టిన పాపాయికి కొన్ని నెలలపాటు తల్లిపాలను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత తెలిపారు. శనివారం గుడిపాలలోని చలిచీమలపల్లెలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన అరగంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. 6 నెలల వరకు కేవలం తల్లిపాలనే తాగించాలని కుటుంబసభ్యులకు తెలియజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఆషా, గిరిజ, షీలాల పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: తల్లిపాలు బిడ్డకు అమృతమని ఎంఎల్‌హెచ్‌పీ పావని తెలిపారు. శనివారం మండలంలోని జి.వడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తాజా కూరగాయలు, గుడ్లు, బాలామృతం, పౌష్టికాహారాలను ప్రదర్శించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శోభ, ఆశా కార్యకర్త సౌందర్య, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మల తెలిపారు. మండలంలోని పాతపాళ్యం, చెంగనపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ కాన్పు అయిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. ఆరునెలల వయసు వరకు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ సంరక్షణ చూసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పండ్లు, గుడ్లు తీసుకోవడంతో తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగిలి ఘాట్‌లో ప్రైవేటు బస్సు బోల్తా

- 13 మందికి స్వల్ప గాయాలు


ప్రమాదానికి గురైన బస్సు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం వేకువ జామున 2 గంటలకు ప్రైవేటు బస్సు బోల్తా పడింది. ఈ సంఘటనలో 13 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సీఐ లక్ష్మయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి నెల్లూరు పోతున్న గ్రీన్‌లైన్ ప్రైవేటు బస్సు మార్గ మధ్యంలో మొగిలి ఘాట్ వద్ద అదుపు తప్పి రహదారి పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్ డ్రైవర్‌తో పాటు 13 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రహదారి పక్కన బోల్తాపడ్డ బస్సును క్రేన్ సాయంతో తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటోనగర్‌లో అన్నదానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆడినెలను పురస్కరించుకుని స్థానిక ఎస్టేట్‌లోని ఆటోనగర్‌లో శనివారం నాగాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి సకల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానంచేశారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు


సీజ్ చేసిన ట్రాక్టర్లు

తవణంపల్లె: మండలంలోని ఎగువ తవణంపల్లె, మైనగుండ్లపల్లె బాహుదా నదిలో శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ వెల్లడించారు. ట్రాక్టర్ల డ్రైవర్లు పి.హరి (29), పి.చిన్నస్వామి(52), పి.వినాయకం(46)పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

చిత్తూరు అర్బన్: నగరంలోని గాంధీ సర్కిల్, మిట్టూరులోని మునస్వామి నాయుడు మున్సిపల్ పార్కులో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ జె.అరుణ ఆదేశించారు. శనివారం మునస్వామి నాయుడు పార్కులో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఫుట్ పాత్ నిర్మాణం, మొక్కల పెంపకం, పిల్లలు ఆడుకునే పరికరాలు, చెట్ల వద్ద చదువుకోవడానికి వీలుగా బల్లలు ఏర్పాటు చేయాలన్నారు. పార్క్ బయట ఆక్రమణలను తొలగించి, పార్కింగ్ కోసం సిద్ధం చేయాలని, వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్ నిర్మాణంపై అధికారులతో చర్చించారు. పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, అపోలో సీఓఓ నరేష్ రెడ్డి, డీఈ రమణ, టీపీఓ శారద, ఇన్‌చార్జి సెంటర్ ఇన్‌స్పెక్టర్ అమరనాథ్ రెడ్డి, టీపీబీఓ మనోజ్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో వేరుశనగలో అధిక దిగుబడి


టి.పుత్తూరులో నిర్వహించిన పొలంబడిలో ఏడీఏ నాగపద్మిని

తవణంపల్లె: రైతులు సకాలంలో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే వేరుశనగలో అధిక దిగుబడి సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ నాగపద్మిని సూచించారు. శనివారం మండలంలోని టి.పుత్తూరులో పొలంబడి కార్యక్రమంలో భాగంగా మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు వేరుశనగ సాగులో తొలుత విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. ఒక కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేసుకుంటే ముఖ్యకుళ్లు తెగులును అరికట్టవచ్చని తెలిపారు. అదేవిధంగా వేరుశనగ పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న, ఆముదం పంటలను కంచె పంటగా వేసుకుంటే రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చని వివరించారు. వేరుశనగలో అంతర పంటగా కంది, అలసంద తదితర పంటలను సాగు చేస్తే అదనపు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. పురుగుల వృద్ధి ఎక్కువగా ఉంటే వేపనూనె 5 ఎంఎల్ లీటరు నీటిలో పిచికారీ చేస్తే నివారణ సాధ్యమని తెలిపారు. వేరుశనగ పంటలో రెండోసారి కలుపు తీసే ముందు జిప్సం ఎరువును ఎకరాకు 200 వందల కేజీలు వాడడంతో నాణ్యమైన, అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకుని తదనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు


బాబు రాజేంద్రప్రసాద్

బంగారుపాళెం: మండల తహసీల్దార్‌గా బాబురాజేంద్రప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి నుంచి వచ్చే రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఐరాల తహసీల్దార్‌గా మహేష్‌కుమార్


మహేష్‌కుమార్

ఐరాల: మండల తహసీల్దార్‌గా కె.మహేష్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చిన శ్రీనివాసులు సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. పెనుమూరు మండలంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న మహేష్‌కుమార్‌కు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. మహేష్‌కుమార్‌కు మండల అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పూతలపట్టు తహసీల్దార్‌గా గుర్రప్ప


ఎన్‌ఎం గుర్రప్ప

పూతలపట్టు: పూతలపట్టు, యాదమరి మండలాలకు నూతన తహసీల్దార్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పూతలపట్టు మండల నూతన తహసీల్దార్‌గా ఎన్‌ఎం గుర్రప్ప శనివారం రెవెన్యూ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు గుడిపాల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఎన్నికల సమయంలో కర్నూలు జిల్లా కోడుమూరుకు బదిలీ అయ్యారు. అక్కడి నుండి కలెక్టర్ ఆదేశానుసారం పూతలపట్టుకు తహసీల్దార్‌గా వచ్చారు. యాదమరి మండలం నూతన తహసీల్దార్‌గా పార్థసారధి శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన యాదమరి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీరు మాట్లాడుతూ మండల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యాలయంలోని సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, అధికారులకు స్వాగతం పలికారు.


యాదమరి తహసీల్దార్ పార్థసారథిని సన్మానిస్తున్న సిబ్బందిలు

చిత్తూరులో కళావతి


కళావతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు తహసీల్దార్‌గా కళావతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పెనుమూరు మండల తహసీల్దార్‌గా పని చేశారు. బదిలీపై ఇక్కడకు రాగా ఆమెను మండల రెవెన్యూ అధికారులు దుశ్శాలువాలతో సన్మానించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్ని ఆమె పేర్కొన్నారు.

తాగునీటికి నాణ్యతా పరీక్షలు తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో తాగునీటికి తప్పనిసరిగా నాణ్యత పరీక్షలు చేయాలని, క్రమం తప్పకుండా శాంపిల్స్ సేకరించాలని కమిషనర్ అరుణ ఆదేశించారు. శనివారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, వార్డు కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏఈలు, అమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా రోజు వారీగా క్షేత్రస్థాయిలో నీటి సరఫరాను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా పైపులైన్ లీకేజీలను గుర్తిస్తే వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. వీధిలైట్ల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అనంతరం వందరోజుల హౌసింగ్ ప్రోగ్రామ్‌పై సమీక్షించారు. నగర పాలక పరిధిలోని లేఔట్లలో ఎల్‌ఎల్, ఆర్‌ఎల్, ఆర్సీ స్థాయిలోని గృహాలను వంద రోజుల్లో పూర్తి చేయించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈలు వెంకట ప్రసాద్, రమణ, హౌసింగ్ ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి


ఎంఈఓకు వినతి పత్రం అందిస్తునన ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలో పనిచేస్తున్న ఏకోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని శనివారం యూటీఎఫ్ నాయకులు ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మొగిలయ్య, జిల్లా కార్యదర్శి సరిత మాట్లాడుతూ పాఠశాలల్లో సింగిల్ టీచర్లుగా పనిచేస్తున్న వారు అత్యవసర పరిస్థితుల్లో తమ సెలవులను వినియోగించుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. సెలవు పొందాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: మండలంలోని పైమాఘంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శనివారం వైద్యాధికారి వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జ్వరాలు సోకిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహామేరకు చికిత్స చేయించుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధులకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టీ.పుత్తూరులో..

మండలంలోని టీ.పుత్తూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రజల ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నాదని తెలిపారు. అనంతరం గర్భిణులు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్యం

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 75 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.